క్లుప్తంగా

పుష్పలమ్మ, ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవం



పూజలు చేస్తున్న సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేత ఆనంద్‌బాబు

దెందులూరు: పెరుగ్గూడెం పంచాయతీ గోవిందపురం గ్రామంలో జగ్గరాజు, శేషమ్మరాజు ఆవరణలో శ్రీ పుష్పలమ్మ, ఎల్లమ్మ తల్లి కల్యాణమహోత్సవం నిర్వహించారు. తొలుత పెరుగ్గూడెం గ్రామ సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కామిరెడ్డి ఆనంద్‌బాబు, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి) ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్ల ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు గాలాయగూడెంలో ఆర్‌బీకే ప్రారంభం

దెందులూరు: గాలాయగూడెంలో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శుక్రవారం ప్రారంభిస్తారని గ్రామ సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

225 మందికి వైద్య సేవలు



కొవ్వలి మొటపర్తి భవన్‌లో వైద్య సేవలందిస్తున్న దృశ్యం

దెందులూరు: కొవ్వలి మొటపర్తి భవన్‌లో గురువారం అను గ్రూప్ వైద్యశాలల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 225 మందికి వివిధ వైద్య పరీక్షలు చేశామని అను గ్రూప్ వైద్యశాలల (ఏలూరు, విజయవాడ) ప్రతినిధి ఎస్ శివశంకర్ తెలిపారు. అవసరమైన వారికి మందులు అందజేశామన్నారు. ప్రతి నెల గిరిజన, గ్రామీణ, శివారు ప్రాంతాల్లో సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఉచితంగా మెగా వైద్యశిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ



హైస్కూల్‌కు ప్రింటర్ బహూకరిస్తున్న దృశ్యం

పెదవేగి : పినకడిమి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థానిక బాలాత్రిపురసుందరి వాని నికేతన్ ట్రస్ట్ సౌజన్యంతో జాస్తి రాజన్‌బాబు, వారి కుటుంబ సభ్యులు రూ.25 వేలు విలువైన ప్రింటర్‌ను బహూకరించారు. ఈ ప్రింటర్ ఎంతో ఉపయోగపడుతుందని హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఉపాధ్యాయులు తేరా ప్రభాకర్, నాగా ర్జున, రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేయడానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్ నత్తానియేలు అన్నారు. గురువారం వ్యాయామ కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఎంపీఈడీ, డిగ్రీలో 55 శాతం మార్కులు ఉండాలని, పీహెచ్‌డీ, నెట్, ఏపీసెట్‌ల వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన ఉంటాయన్నారు. అభ్యర్థులు బయోడేటా, జిరాక్స్ కాపీలను మెయిల్ ఐడీ ప్రిన్సిపాల్ ఎస్‌ఎస్‌ఆర్ జీసీపీఈజీపీఎం ఎట్‌దారేఫ్ జీమెయిల్‌కు ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేయాలని ప్రిన్సిపాల్ కోరారు.

వైఎస్సార్‌సీపీకి రెండోసారి విజయం ఖాయం



ఏపూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



ఏపూరులో ప్రజా ఆశీర్వాద యాత్ర చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు

ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

పెదపాడు: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా రెండోసారి రెపరెపలాడటం ఖాయమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదపాడు మండలం ఏపూరు గ్రామంలో ఆయన గురువారం ప్రజాఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు మాట్లాడుతూ ఏపూరులో డీబీటీ రూపంలో రూ.31 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.17.65 కోట్లు ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎం సీట్లో కూర్చోబెట్టేందుకు సిద్ధమా అని కోరగా ప్రజలు సిద్ధమంటూ ముక్తకంఠంతో నినదించారు. జగన్ ప్రభుత్వంలో డ్వాక్రా రుణమాఫీ అవుతోందా లేదా, అమ్మఒడి వస్తోందా, చేయూత, వాహన మిత్ర వస్తోందా అని అడుగగా.. అన్నీ సక్రమంగానే వస్తున్నాయంటూ ప్రజలు బదులిచ్చారు. 10 ఎకరాలకు పైగా భూమిని రూ.4 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలు అందించామని ఎమ్మెల్యే చెప్పారు. నాడు నేడు పథకంలో రూ.19 లక్షల వ్యయంతో పాఠశాలను అభివృద్ధి చేశామన్నారు. కాలనీలో బోర్‌వెల్, అంతర్గత రహదారులు అభివృద్ధి చేశామని తెలిపారు. రూ.20 లక్షలతో సీసీ రహదారులు అభివృద్ధి చేశామని చెప్పారు. గతంలో చంద్రబాబు మోసాలు గుర్తు చేసుకోవాలని, నేడు జగన్ చేస్తోన్న అభివృద్ధిని ఆదరించాలని కోరారు. రుణమాఫీ, గోల్డ్ లోను మాఫీ చేస్తామని, మూడు సెంట్ల ఇళ్ల స్థలం, గ్యాస్ బండలు ఉచితంగా ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఇచ్చారా ? గత ప్రభుత్వంలో ఒక్క సెంటు స్థలమైనా ఇచ్చారా అని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రశ్నించడంతో చంద్రబాబు ఇవ్వలేదంటూ ప్రజలు తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు గ్రామాల్లో తిరుగుతూ గ్యారంటీ ఇస్తామని చెబుతున్నాయని, వారికే గ్యారంటీ లేదు.. మన భవిష్యత్‌కు వారేమి గ్యారంటీ ఇస్తారో అర్థం కాలేదని ఎమ్మెల్యే కొఠారు విమర్శించారు. మనకు గ్యారంటీ ఇచ్చేందుకు జగనన్న ఉన్నారని ఆయనే మన భవిష్యత్‌కు ష్యూరిటీ అని చెప్పడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి, గ్రామ సర్పంచ్ చోడగిరి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు బెజవాడ శిరీషా, రాజులపాటి నాగమల్లేశ్వరావు, బెజవాడ శేఖర్, బెజవాడ సత్యనారాయణ, బెజవాడ నర్సింహారావు, ఏఎంసీ చైర్మన్ అప్పనప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి ఆళ్ల సతీష్ చౌదరి, దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని, కంభంపాటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, వేమూరి జితేంద్ర పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



ఉప్పాకపాడులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం తథ్యమని ఉంగుటూరు శాసనసభ్యుడు పుప్పాల వాసుబాబు స్పష్టం చేశారు. గురువారం ఉప్పాకపాడు గ్రామంలో గడపగడపకుమన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అలాగే గ్రామంలోని నాయకులు పల్లెకు పోదాం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన నాలుగున్నర ఏళ్లల్లో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకుని పేదల గుండెల్లో నిలిచారన్నారు. అలాగే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి గ్రామ స్వరూపాలే మార్చేశామని వివరించారు. గతంలో గ్రామాల్లో ఇంత అభివృద్ధి జరిగిందా? అనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలని కోరారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్ ప్రభుత్వంలోనే సాకారమైందన్నారు . గ్రామ సచివాలయాలు ఏర్పాటు అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. అనంతరం ఉప్పాకపాడు గ్రామంలో ప్రభుత్వం అమలు చేసిన రూ.14.70 కోట్ల విలువైన సంక్షేమం, అభివృద్ధి పనులు వివరాలు ఉన్న ఫ్లెక్సీను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మెన్ మరడ రమావతి, సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావు బాబ్జి, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ అధ్యక్షుడు పుప్పాలగోపి, నాయకులు కొరిపల్లి శ్రీను, నేదూరి వీర వెంకట మోహనరావు, షేక్ వల్లీ, నేదూరి పాండురంగరావు, పులపర్తి చిన్న అబ్బాయి, కోరసాల అశ్వతరావు, గోపిశెట్టి రామకృష్ణ, సత్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక ఎలుకల నిర్మూలన

ఉంగుటూరు: మండలంలో శుక్రవారం సామూహిక ఎలుకలు నిర్మూలన కోసం వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు గురువారం పొలం గట్లపై ఎలుకలు కన్నాలు గుర్తించే కార్యక్రమం నిర్వహించారు. అలానే ఖాళీ స్థలాల్లో ఎలుకల బొరియలు గుర్తించి వాటిని మూసేశారు. శుక్రవారం తెరుచుకున్న బొరియల వద్ద బ్రోమోడయోలిన్ మందు పెట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి బాలిన వెంకటేష్ తెలిపారు. బ్రోమోడయోలిన్ మందును గురువారం అన్ని గ్రామాల్లోని రైతులకు అందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు: మండలంలోని బాదంపూడి, వెల్లమిల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఏఈ శ్రీరామ్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వార్షిక మరమ్మతుల నేపథ్యంలో నిలుపుదల ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వలంటీర్లకు సత్కారం



సేవా రత్న అవార్డుకు ఎంపికైన సూర్యకుమారిని సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

భీమడోలు: ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా జగనన్న సైనికులైన గ్రామ వలంటీర్లకు వలంటీ ర్లు వందన కార్యక్రమంలో అవార్డులను అందుకుని తన సేవలకు తగిన గుర్తింపు పొందారు. గురువారం జిల్లా కలెక్టరేట్ వద్ద వలంటీర్ల వందనం కారక్రమంలో ఏడాది పాటు ప్రజలుకు సంక్షేమ పథకాలను గడపగడపకు చేరువ చేసి ఉత్తమ సేవలందించిన వలంటీర్లను తగిన విధంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక సేవా మిత్ర, సేవా రత్నం, సేవా వజ్ర అవార్డులతో వారికి సన్మానించారు. సూరప్పగూడేనికి చెందిన వలంటీర్ వెజ్జు దేవి శివ పార్వతీ సేవా వజ్ర, అదే గ్రామానికి చెందిన వలంటీర్ మనికిరెడ్డి సూర్యకుమారి ఉత్తమ సేవా రత్న అవార్డులకు ఎంపికయ్యారు. వారిని ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ వారిని సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందించారు. వారికి నగదు పురస్కారాన్ని అందించా రు. మండలంలో ఎంపికైన సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రలకు రూ.45వేలు, రూ.30వేలు, రూ.15 వేల చొప్పున నగదు పురస్కారాన్ని ప్రభుత్వం అందిస్తుంది.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న బాలల సంరక్షణాధికారిణి డాక్టర్ సీహెచ్ సూర్యచక్రవేణి

భీమడోలు: బాలల హక్కుల పరిరణలో స్నేహపూర్వక గ్రామాల సభ్యులు కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణాధికారిణి డాక్టర్ సీహెచ్ సూర్యచక్రవేణి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో గురువారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, బాలల హక్కుల విద్య ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 10 బాలల స్నేహపూర్వక గ్రామాల బాలల సంరక్షణ కమిటి సభ్యులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ జిల్లా సంరక్షణాధికారి సీహెచ్ శ్రీకాంత్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా బాలల సంరక్షణాధికారిణి సూర్యచక్రవేణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జి.భానుశ్రీలు పాల్గొన్నారు. బాల కార్మికులు, బాల్య వివాహాలు, లైంగిక సమస్యలు, డ్రగ్స్ వినియోగం తదితర అంశాలపై సభ్యులతో వారు సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారీరక, మానసికాభివృద్ధితో పాటు మనోవికాసాభివృద్ధి ద్వారా బాలలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతారన్నారు. ఇటీవల బాలుర్‌పై ట్రాన్స్ జండర్లు లైంగిక వేధింపు మీతిమీరిపోతున్నాయన్నారు. నేటి సమాజంలో పరిస్థితుల ప్రభావం, అంతర్గత హార్మోన్ల వల్ల వారిలో ట్రాన్స్‌జండర్లుగా మారిపోతున్నాయని, తల్లిదండ్రులు, టీచర్లు పిల్లల్లో వచ్చే మార్పులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బాల్య వివాహాలు చట్టారీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు గ్రామస్థాయిలో కమిటీ సభ్యులు ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. గ్రామస్థాయిలో జరిగే ప్రతి సమస్యలను తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర సమన్వయకర్త ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. బాలల హక్కుల పరిర క్షణ కోసం చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ ప్రతి గ్రామం నుంచి బాలల రక్షణ కమిటీలు, స్నేహపూర్వక గ్రామాల్లోని సభ్యులు ఎంపిక చేసుకుని వారి ద్వారా బాలల హక్కులు కాపాడడంలో ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ కేవీ విజయలక్ష్మీ, హెచ్‌ఎం జి.బాలభాస్కర్, ఆర్‌ఐ కిరణ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలపై శుక్రవారం నిర్వహించే గ్రామీణ బారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ నర్సింహ, కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబాకు పుష్పాభిషేకం



సాయి పుస్తకాలను స్థూపంలో నిక్షిప్తం చేస్తున్న భక్తులు

పెదవేగి : మండలంలోని లక్ష్మీపురం గార్డెన్స్‌లోని షిర్డీ సాయి బాబా సేవాశ్రమంలో మందిర వార్షికోత్సవాల ఆఖరి రోజు గురువారం బాబా వారికి పుష్పాభిషేకం చేశారు. శ్రీసాయి నామాలు గల సాయి కోటి పుస్తకాలను భక్తుల చేతుల మీదుగా సాయి వరలక్ష్మి 100 అడుగుల ఎత్తు గల సాయి కోటి మహాస్థూపంలో నిక్షిప్తం చేయడం ఈ రోజు ప్రత్యేకత అని నిర్వాహకులు తెలిపారు.

సీఆర్‌ఆర్ ఫార్మసీ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్



సీఆర్‌ఆర్ ఫార్మసీ కళాశాలకు నాక్ - ఏ గ్రేడ్ సర్టిఫికెట్ అందిస్తున్న నాక్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ఆర్ ఫార్మసీ కళాశాలకు నాక్ - ఏ గ్రేడ్ లభించిందని కరస్పాండెంట్ మాగంటి రాజా రామ్మోహనరావు తెలిపారు. ఈ మేరకు నాక్ బృందం కళాశాలను సందర్శించి గురువారం ఏ గ్రేడ్ గుర్తింపు పత్రాలను అందించారని చెప్పారు. నాక్ ప్రతినిధులు తమ కళాశాలను సందర్శించి కళాశాలలో అందుబాటులో ఉన్న ప్రమాణాలు, విద్యార్థులు నిష్పత్తి, విద్యార్థులకు యాజమాన్యం కల్పించిన మౌలిక వసతులు, సిబ్బంది, విద్యార్థులు చేపట్టిన వివిధ పరిశోధనా ప్రాజెక్టులు వంటి కేటగిరీలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారని వివరించారు. ప్రిన్సిపాల్ ఎ.నరేంద్రబాబు మాట్లాడుతూ తమ కళాశాలకు నాక్ - ఏ గ్రేడు గుర్తింపు రావడంతో తమపై మరింత బాధ్యత పెంచిందన్నారు. ఫార్మసీ కళాశాలలో నాలుగేళ్ల బీ ఫార్మసీ కోర్సు, రెండేళ్ల డీ ఫార్మసీ కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని కోర్సుల్లో కలిపి మొత్తం 520 మంది విద్యార్థులున్నారని తెలిపారు. కళాశాల ఈ స్థాయికి చేరుకోవడానికి పూర్తి సహాయ సహకారాలు అందించిన విద్యా సంస్థల అధ్యక్షుడు అల్లూరి ఇంద్రకుమార్, కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్, ఇతర ఆఫీస్ బేరర్లు, మేనేజింగ్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ రంగ విద్యపై ప్రత్యేక దృష్టి



ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ సోమశేఖర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ టీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో ప్రభుత్వ రంగ విద్య అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామని సమగ్రశిక్షా అభియాన్ ఏలూరు జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.సోమశేఖర్ అన్నారు. ఏలూరు తహసీల్దారుగా పని చేస్తూ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన సోమశేఖర్ గురువారం తన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఆదేశించిన లక్ష్యాలను కాలంలో పూర్తి చేసి జిల్లాను అగ్రభాగంలో నిలిపేందుకు కృషి చేస్తానని సోమశేఖర్ తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి రెండో విడతలో చేపట్టిన మన బడి నాడు - నేడు పనులు పూర్తిచేసి విద్యార్థులకు అధునాతన తరగతి గదులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. జగనన్న విద్యాకానుకను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే రోజునే విద్యార్థులకు అందలేలా చర్యలు చేపడతామని తెలిపారు. సోమశేఖర్‌కు వైఎస్సార్ టీఎఫ్ నాయకులు గెడ్డం సుధీర్, వి.రామ్మోహనరావు, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ కార్యదర్శి ఎ.సర్వేశ్వరరావు, సమగ్రశిక్ష అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



వట్లూరులో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ భావన్నారాయణ

పెదపాడు : మండలంలోని వట్లూరు సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ను తహసీల్దార్ భావన్నారాయణ పరిశీలించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. మండల సర్వేయర్ కోదండరామ్, వీఆర్వో, ఆర్‌ఏఎస్‌ఆర్ చంద్రమూర్తి, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

ఏలూరు(మెట్రో): ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఏలూరు జెడ్పీ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు నిరసన తెలిపార. కార్యక్రమంలో ఆర్‌ఎస్ హరనాథ్, ఆర్.రవికుమార్, అలీ, పాలిశెట్టి, పువ్వుల ఆంజనేయులు, ఎ.శ్రీధర్‌రాజు, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.